యూనిట్ III

# 10. జీవన భాష్యం

– ఆచార్య సి. నారాయణరెడ్డి

**చదవండి - ఆలోచించండి - చెప్పండి**

"శ్రద్ధగలవాడే జ్ఞానాన్ని పొందుతాడు".
"చీకటిని తిడుతూ కూచునే కన్నా చిన్న దీపం వెలిగించు".
"అణుశక్తి కన్నా ఆత్మశక్తి మిన్న".
"త్యాగ గుణమునకు తరువులే గురువులు".

## ప్రశ్నలు

1. పై వాక్యాల ద్వారా మీరేం గ్రహించారు?
2. ఇలాంటి వాక్యాలనేమంటారు?
3. ఇలాంటి సందేశాలు, మంచి మాటలు ఇంకా ఏఏ రూపాలలో ఉంటాయి?

© SCERT not to be republished

## ఉద్దేశం

దుఃఖాన్ని తట్టుకుంటూ, కష్టాలను ఎదుర్కుంటూ, తనంతకు తాను ఎదుగుతూ, ఇతరుల కోసం పాటుపడుతూ జీవించే మనిషి, సమాజంలో గౌరవం పొందుతాడని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

**ప్రస్తుత పాఠ్యభాగం 'డాక్టర్ సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం ఆరవ సంపుటి'లోని "తెలుగు గజళ్ళు" లోనిది.**

## విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. పదపట్టిక చూసి తెలియని పదాలకు అర్థాలు తెలుసుకోండి.
2. సందర్భానికి తగిన అర్థాలు గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
3. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

మబ్బుకు మనసే కరిగితే అది నీరవుతుంది
మనసుకు మబ్బే ముసిరితే కన్నీరవుతుంది
వంకలు డొంకలు కలవనీ జడిపించకు నేస్తం!
జంకని అడుగులు కదిలితే అది దారవుతుంది.
ఎడారి దిబ్బలు దున్నితే ఫలమేముందనకు
ఇసుక గుండెలు పగిలితే అది పైరవుతుంది
మనిషీ మృగమూ ఒకటనీ అనుకుంటే వ్యర్థం
మనుషులు పదుగురు కూడితే ఒక ఊరవుతుంది
ఎంతటి ఎత్తుల కెదిగినా ఉంటుంది పరీక్ష
హిమగిరి శిరసే మాడితే అది యేరవుతుంది
బిరుదులు పొందే వ్యాప్తికీ విలువేమి "సినారే"
చెరగని త్యాగం మిగిలితే ఒక పేరవుతుంది.





© SCERT not to be republished

## కవి పరిచయం



ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి 1931లో కరీంనగర్ జిల్లా హనుమాజీపేట గ్రామంలో పుట్టారు. వీరు ప్రముఖ ఆధునిక కవి, వక్త, పరిశోధకులు, బహుభాషావేత్త, ప్రయోగశీలి.

నాగార్జున సాగరం, కర్పూర వసంత రాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర, ప్రపంచ పదులు మొదలైన నలభైకి పైగా కావ్యాలు, అద్భుతమైన సినిమా పాటలు రాసారు. 'ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగములు' అన్న వీరి సిద్ధాంత గ్రంథము ఎన్నో ముద్రణలను పొందింది. వీరి 'విశ్వంభర' కావ్యానికి జాతీయ స్థాయిలో అత్యున్నత సాహితీ పురస్కారమైన 'జ్ఞానపీఠ అవార్డు' లభించింది. భారత ప్రభుత్వం వీరిని పద్మభూషణ్ బిరుదుతో గౌరవించింది.

వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ఆచార్యులుగా, అధికార భాషాసంఘం అధ్యక్షులుగా, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికీ, తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా పని చేశారు. రాజ్యసభ సభ్యులుగా సేవలందించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా ఉన్నారు. 'చమత్కారం' - వీరి కలానికీ గళానికీ ఉన్న ప్రత్యేకత.

### ప్రక్రియ -

ఉర్దూ సాహిత్య ప్రక్రియ 'గజల్'. దీంట్లో ఒకే విషయాన్ని చెప్పాలనే నిర్బంధం ఉండదు. గజల్‌లోని భావం ఏ చరణానికి ఆ చరణం విడిగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రెండు చరణాలు కలిసి ఒకే భావాన్ని వ్యక్తపరుస్తాయి. గజల్ పల్లవిని ఉర్దూలో 'మత్లా' అని, చివరి చరణాన్ని "మక్తా" అని అంటారు. పల్లవి చివర ఉన్న పదం, ప్రతి చరణం చివర అంత్యప్రాసను రూపొందిస్తుంది. చివరి చరణంలో కవి నామముద్ర ఉంటుంది. దీన్ని "తఖల్లస్" అంటారు. సరసభావన, చమత్కార ఖేలన, ఇంపు, కుదింపు గజల్ జీవగుణాలు.

## సారాంశం -

నీటితో నిండిన మబ్బులు తేమతో బరువెక్కితే వర్షమై అవి భూమి మీద కురుస్తాయి. అలాగే మనసుకు ఆందోళనలు, బాధలు, చింతలు అనే దిగులుమబ్బులు కమ్ముకుంటే దుఃఖస్థితి వస్తుంది. అది కన్నీరుగా మారుతుంది.

ఒక లక్ష్యాన్ని సాధించడానికి బయలుదేరినపుడు అడుగడుగునా ఎన్నో కష్టాలు, అడ్డంకులు ఎదురవుతాయని లోకం భయపెడుతుంది. కాని ఆ మాటలకు భయపడకుండా నిరుత్సాహపడకుండా ముందుకు నడిస్తేనే విజయం లభిస్తుంది. ఆ స్ఫూర్తే నలుగురు అనుసరించే దారిగా మారుతుంది.

బీడుపడి, పనికిరాకుండా ఉన్న నేలలో ఏ పంటలూ పండవని ఏ ప్రయత్నాలూ చేయకుండానే నిరాశపడవద్దు. కష్టపడి ఆ నేలను దున్నితే, విశ్వాసంతో విత్తనాలు నాటితే మంచి పంటలు పండుతాయి.

నలుగురు మనుషులు కలిసి పరస్పర సహకారంతో జీవించడమే ఉత్తమ సాంఘిక జీవనం. సాటి మనుషుల పట్ల సానుకూల దృక్పథాన్ని ఏర్పరచుకోవాలి. అప్పుడే అందరు కలిసి ఆనందంగా జీవించగలుగుతారు. అటువంటి మనుషులు కలిస్తేనే ఒక ఊరు ఏర్పడుతుంది.

ఎంత సామర్థ్యమున్నా, అధికారం, సంపదలు ఉన్నా, ఎన్నో విజయాలు సాధించినా, ఇక నాకు ఏ కష్టాలూ, బాధలూ రావని ధీమాగా ఉండలేం. విధి ఎప్పుడు ఏ కష్టాలు కలిగిస్తుందో, సమస్యల పరీక్షలు పెడుతుందో ఎవరూ ఊహించలేరు. దాని శక్తి ముందు ఎవరైనా తలవంచవలసిందే. ఉన్నతమైన హిమాలయ పర్వత శిఖరం కూడా ఎండ వేడికి కరిగిపోయి నదిగా ప్రవహించవలసిందే! అలాగే ఎంతటి మనిషైనా గర్వం నీరు కారిపోవలసిందే.

మనపేరు ప్రపంచానికంతా తెలిసేలా ప్రఖ్యాతి పొందామని, ప్రతిష్ఠాత్మక బిరుదులు, సత్కారాలు పొందామని అనుకోవడంలో నిజమైనవిలువ, గుర్తింపు లేదు. మానవాళికి పనికివచ్చే గొప్పపని, నిస్స్వార్థ త్యాగం చేస్తేనే ఆ మనిషిపేరు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది.

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I. వినడం - మాట్లాడడం

1. 'జీవన భాష్యం' గజల్‌ను రాగయుక్తంగా, భావయుక్తంగా పాడండి.
2. 'జీవన భాష్యం' అనే పేరు ఈ పాఠానికి తగిన విధంగా ఉందా? ఎందుకు? చర్చించండి.
3. ఈ గజల్‌లో మీకు బాగా నచ్చిన చరణాలు ఏవి? ఎందుకు నచ్చాయో సమర్థిస్తూ వివరణ ఇవ్వండి.
4. ఈ 'గజల్' ద్వారా 'సినారె' ఏం సందేశమిస్తున్నారు?

### II. చదవడం, అవగాహన చేసుకోవడం

(అ) కరిగితే, ముసిరితే వంటి పదాలు గజల్‌లో ఎక్కడెక్కడ ఉన్నాయో చూసి వాటి కింద గీత గీయండి. ఆ పాదాలు రాయండి.

(ఆ) గజల్‌లో కవి తన గురించి ప్రస్తావించిన పంక్తులు ఏవి? వాటిని రాసి భావాన్ని సొంత మాటల్లో రాయండి.

**2. కింది పేరాను చదివి, ఐదు ప్రశ్నలు తయారు చేయండి.**

చైనా తత్త్వవేత్త కన్ఫ్యూషియస్. ఆయన చాలా తెలివైనవాడు. ఒక రాజుగారు ఇతణ్ణి గురించి విని తన సభకు పిలిపించుకున్నాడు. మూడు పంజరాలు చూపించాడు. మొదటి పంజరంలో ఒక ఎలుక, దాని ఎదురుగా తినే పదార్థాలు ఉన్నాయి. రెండో పంజరంలో పిల్లి ఉంది, దాని ఎదురుగా పళ్ళెములో పాలు ఉన్నాయి. మూడో పంజరంలో ఒక గద్ద ఉంది, దాని ఎదురుగా తాజా మాంసం ఉంది. కానీ ఎలుక ఏ పదార్థమూ తినటం లేదు; పిల్లి పాలు ముట్టుకోవడం లేదు; గద్ద కూడా మాంసం ముట్టడం లేదు. దీనికి కారణమేమిటి? అని అడిగాడు రాజు. తత్త్వవేత్త ఇలా సమాధానం ఇచ్చాడు. పిల్లిని చూసి భయపడి ఎలుక ఆహారం తీసుకోలేదు. పిల్లి ఎలుక మీద ఆశతో పాలు ముట్టుకోలేదు. పిల్లిని, ఎలుకను ఒకేసారి తినాలనే ఆశతో గద్ద మాంసం ముట్టుకోలేదు. అలాగే భవిష్యత్తు మీద ఆశతో ప్రజలు వర్తమానాన్ని విస్మరిస్తున్నారు. సుఖానికి దూరమవుతున్నారు. ఈ సమాధానానికి సంతృప్తి పడి రాజు కన్ఫ్యూషియస్‌కు విలువైన బహుమానాన్ని ఇచ్చాడు.

ప్రశ్నలు -

(అ) ----------------------------------------

(ఆ) ----------------------------------------

(ఇ) ----------------------------------------

(ఈ) ----------------------------------------

(ఉ) ----------------------------------------

© SCERT not to be republished

3. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా సమాధానాలు రాయండి.

(అ) "ఎడారి దిబ్బలు దున్నితే ఫలమేముందనకు" అనే వాక్యంలో మీరేం గ్రహించారు?

(ఆ) మన పేరు శాశ్వతంగా నిలవాలంటే ఏం చేయాలి?

(ఇ) 'ఎంత ఎత్తుకు ఎదిగినా ఉంటుంది పరీక్ష' అనే వాక్యం ద్వారా కవి మనకు ఇచ్చిన సందేశం ఏమిటి?

## III. స్వీయ రచన

1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.

(అ) ఈ పాఠంలో గజల్ ప్రక్రియను గూర్చి తెలుసుకున్నారు కదా! మీకు తెలిసిన నాలుగు సాహిత్య ప్రక్రియల పేర్లు తెలపండి. వాటిని గురించి రాయండి.

(ఆ) "ఎడారి దిబ్బలు దున్నితే ఫలమేముందనకు" అనే వాక్యం ద్వారా విద్యార్థులకు 'సినారె' ఇచ్చే సందేశం ఏమై ఉండవచ్చు?

(ఇ) మంచి పంటలు పండడానికి రైతు చేసే శ్రమ ఎలాంటిదో వివరించండి.

(ఈ) "చెరగని త్యాగం మిగిలితే ఒక పేరవుతుంది" అంటే త్యాగం చేసేవారి, మంచి పనులు చేసే వారి పేర్లు చరిత్రలో శాశ్వతంగా నిలుస్తాయి అని అర్థం. అందుకోసం ఎలాంటి మంచి పనులు చేయాలి?

(ఉ) 'మనుషులు పదుగురు కూడితే ఒక ఊరవుతుంది' అని 'సినారె' ఎందుకు అని ఉంటారు?

2. కింది ప్రశ్నలకు పది వాక్యాల్లో సమాధానాలు రాయండి.

(అ) 'జీవన భాష్యం' గజల్ సారాంశం మీ సొంత మాటల్లో రాయండి.

(ఆ) ఏదైనా ఒక లక్ష్య సాధనలో విజయమూ కలగవచ్చు! అపజయమూ కలగవచ్చు! అందుకు గల కారణాలు ఊహించి రాయండి.

## IV. పదజాలం

1 కింది పదాలకు అర్థాలు తెలుసుకోండి ఆ పదాల్ని ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.

| | | | |
|---|---|---|---|
| (అ) ముసరడం | = ------ | (ఇ) జంకని అడుగుల | = ------ |
| (ఆ) ఎడారి దిబ్బలు | = ------ | (ఈ) చెరగని త్యాగం | = ------ |

## V. సృజనాత్మకత

| | | |
|---|---|---|
| 'జీవన భాష్యం" గజల్‌లోని అంత్య ప్రాసల ఆధారంగా సొంతగా ఒక వచన కవితను రాయండి.<br>------ నీరవుతుంది.<br>------ దారవుతుంది.<br>------ పైరవుతుంది.<br>------ ఊరవుతుంది.<br>------ మేరవుతుంది.<br>------ పేరవుతుంది. | (లేదా) | ఆచార్య సి. నారాయణరెడ్డి గారు ఒకవేళ మీ పాఠశాలకు వస్తే ఆయన్నుండి మీరు ఏం తెలుసుకోవాలనుకొంటున్నారో ప్రశ్నలు రాయండి. |

© SCERT not to be republished

## VI. ప్రశంస

చదువులో వెనకబడిన ఒక విద్యార్థి తనలో కలిగిన మార్పువల్ల కొద్దికాలంలోనే గతంలో కన్నా మెరుగైన ఫలితాలను పొందాడు. అతనిలో వచ్చిన మార్పును గురించి తెలుపుతూ వాళ్ళ అమ్మానాన్నలకి ఉత్తరం రాయండి.

## VII. భాషను గురించి తెలుసుకొందాం

### 1. కింది పదాలు విడదీసి, సంధుల పేర్లను పేర్కొనండి.

| | | |
|---|---|---|
| (అ) కన్నీరవుతుంది | + | |
| (ఆ) యేరవుతుంది | + | |
| (ఇ) దారవుతుంది | + | |
| (ఈ) పైరవుతుంది | + | |

### 2. రూపకాలంకారం

కింది వాక్యాన్ని చదవండి.

"ఆయన మాట కఠినమైనా మనసు వెన్న".

పై వాక్యంలో

మనసు – ఉపమేయం (పోల్చబడేది)

వెన్న – ఉపమానం (పోల్చినది)

ఉపమానమైన 'వెన్న' లక్షణాలను, ఉపమేయమైన 'మనసుకు' భేదంలేకుండా పోల్చడం జరిగింది.

అంటే,

వెన్నకు, మనసుకు భేదం లేదు. రెండూ ఒకటే (మెత్తనివే) అనే భావాన్ని ఇస్తున్నది.

ఇలా,

**ఉపమాన ధర్మాన్ని ఉపమేయంలో ఆరోపించి వీటి రెంటికి అభేదాన్ని (భేదం లేదని) చెప్పడమే 'రూపకాలంకారం' అంటారు.**

### 3. కింది వాక్యాలను పరిశీలించండి, అలంకారాన్ని గుర్తించండి.

(అ) మా అన్న చేసే వంట నలభీమపాకం.

(ఆ) కుటుంబానికి తండ్రే హిమగిరి శిఖరం.

**ప్రాజెక్టు పని**

ఆచార్య సి.నారాయణ రెడ్డిగారి రచనలు, పాటల వివరాలను సేకరించి ఒక పట్టికను తయారు చేయండి. దాన్ని తరగతిలో చదివి వినిపించండి, ప్రదర్శించండి.

**నేనివి చేయగలనా ?**

| | |
|---|---|
| 1. ఉర్దూ సాహిత్య ప్రక్రియ 'గజల్' ను గురించి వివరించగలను, భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను. | ఔను / కాదు |
| 3. గజల్ సారాంశాన్ని సొంత మాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. పాఠంలోని పదాల ఆధారంగా వచన కవితను రాయగలను. | ఔను / కాదు |

**తెలివైన వాళ్ళు గడచి పోయినదానికి శోకించరు. జరుగుతున్న పనులమీదనే దృష్టి పెడతారు.**

© SCERT not to be republished